# మరపుల్లో మెరపులు

**1980** జనవరి 30 తేదీ ఉదయం భద్రాచలం బస్సు పాల్వంచ దగ్గర ఆగింది.

పాల్వంచ అనగానే ఏదో జ్ఞాపకం చట్టున పొడిచింది.

ముందు సీట్లో కూచున్న ఆయన్ని కదిపి "అయ్యా, ఇక్కడెక్కడో కిన్నెరసాని వుందట—" అన్నాను.

ఆయన నన్ను ఎగాదిగా చూసి నవ్వి— "వుండంది— చూద్దురు గాని... రెండు మూడు నిమిషాల్లో వస్తుంది" అన్నాడు. బస్సు ఒక వంతెనమీదకు వచ్చింది. కింద ఒక వాగు మెలికలు తిరిగి ఒయ్యారంగా ప్రవహిస్తోంది. మామూలు సెలయేరు.

కోనసీమలో కౌశికిలా ఉంది.

ఇదే 'కిన్నెరసాని' అన్నాడు.

ఒళ్ళు జల్లుమంది—

1960 జనవరి 30 తేదీన ఆగ్రాలో తాజ్‌మహల్‌ను చూచినప్పుడు కూడా అంత "థ్రిల్" అనుభవించలేదు.

ముఖమంతా కళ్ళుచేసుకు చూశాను.

ఏనాటి కోరిక;

"ఓహో కిన్నెరసానీ; ఓహో కిన్నెరసానీ;
ఊహామాత్రము లోపల ఏల నిలువవే! జవరాలా;"

అప్రయత్నంగా గొంతులో పాట కదిలింది.

"అచట కిన్నెరసాని - నా యాత్మయందు
కథ ఇప్పటికి దాని సంగీత మే నదించు"

గౌతమీ గాథలు

60 3567
శ్రీకాకుళం

అన్నాడు పాపం, ఆ నాటి విశ్వనాథ-ఎంత కదిలిపోయి పాడాడో ఊరూ పేరూ లేని ఆ చిరువాగుకు అమరత్వం ప్రసాదించి పోయాడు.

"తెలుగు సత్కవిరాజు పలు కందుకోలేని
చపులూరి చపులూరి సాగింం" దట కిన్నెర.

"తెలుగు దైవమ్ము భద్రాద్రిపై నెలకొన్న

రామయ్య-అతని దర్శనము చేసేత్రోవ

కాచింది కిన్నెర"-భేష్. ఆ రామయ్య దర్శనానికి ముందు ఈ కిన్నెర చూపు ఎంత హృద్యంగా వుంది!

బస్సు ఆగింది. భద్రాద్రిలో ప్రవేశించి-సరాసరి గోదావరికి వెళ్ళాను.

అమ్మ గౌతమిని రాజమహేంద్రవరం దగ్గర ఎంతో నిండుగా అఖండంగా చూడడం అలవాటు! ఇక్కడ ఇంత కృశించి ఉందేమిటి?

"వేణీభూత ప్రతను సలిల" నివ్వెరపోయాను.

తనివితీర అమ్మను కౌగలించుకున్నాను. కడుపార పయస్సులు త్రాగాను. దేశంలో ఎన్ని నదులు లేవు? ఏమిటీ హృదయ బంధం?

రామదాసధ్యానమందిరం ప్రాంగణంలో నిలబడి, ఎక్కడో పడమటి కనుమల్లో పుట్టి తూర్పుగా ప్రశాంత గంభీరంగా సాగిపోయే గోదావరీ ప్రవాహంవైపు రెప్పవాల్చకుండా చూస్తున్నాను.

"భగవతి గోదావరి నమస్తే"

ఆ తల్లిని తలుచుకుని నాకన్న వెర్రిగా పులకించిపోయే మా అన్న భవభూతి జ్ఞాపకం వచ్చాడు!

ఎక్కడో దక్షిణ ప్రాంత సరస్తీరంలో జరిగిన శంబూక వృత్తాంతం పంచవటీ తీరానికి తెచ్చాడు. మనసు పట్టలేక.

"ఏతే తే కుహరేషు గద్గద నదద్గోదావరీ వారయః..." అని నోరారా అంటేగాని ఆయనకు తోచదు.

"మూడు కన్నుల కొండమీదా తోడు నీడా లేక పుట్టీ కూడుకొన్నది కొత్తవారిని జోడుగా నడిచింది తోయం బెయురా — తెడ్డేయురా" — అంటాడు ఓలేటూరి నారాయణరావుగారు. ఒకసారి రాజమండ్రిలో విద్యార్థులతో బోటు షికారుకు వెళ్ళి కెరటాలమీద తేలుతూ తెడ్లు వేయించి పాడాడట, ఆ పుణ్య పురుషుడు!

ఆ తల్లి మూడుకన్నుల కొండమీద పుట్టినా — బుద్ధి వక్రించి అటు ఆరేబియా సముద్రంలోకి జారితే — ఇంకేముంది? మనకు మిగిలేవి రాళ్ళా రప్పలూ, చోళ్ళా, జొన్నలూ — తెలుగువాళ్ళ సుకృతం పెద్దది!

ఏళ్ళతరబడి దప్పి తీరింది; నట్టింట బంగారం పండింది!

"స్వామీ. మీరు రాముణ్ణి చూడ్డానికి వచ్చారా? గోదావరినా?" అని యెవరో చెవిలో గిల్లిపెట్టి నట్టయింది.

నవ్వి అన్నాను. "ముందు అమ్మను, తర్వాత అయ్యను."

గోదావరిని చూస్తే తలనిండా-పిలిస్తే పలికే యెన్ని జ్ఞాపకాలు!

విశాఖ మండలంలో పుట్టి ప్రయాణవశాత్తు రాజమండ్రిలో రైలు దిగిన పది పన్నెండేళ్ళ కుర్రాడు రహదారీ పడవ ఎక్కడానికి గోదావరి ఒడ్డుకు వచ్చాడు.

విశాలంగా పరుచుకున్న అంత విసీల జలపటాన్ని ఎప్పుడూ చూసి ఎరుగడు. కళ్ళింత చేసుకు చూస్తున్నాడు.

పడవ కడుపున సామాన్లతో నింపారు. తెరచాప ఎత్తారు. "హైలెస్సా" అంటూ సరంగులు గోదావరి యాసతో పడవను లోతుకు తోస్తున్నారు. ఎవరో తొందరచేస్తే పడవెక్కి పడిచెక్కమీద కూచున్నాడు.

చల్లని నదీ హృదయంమీద పడవ కదులుతోంది. "దాని అడుగున నా పూర్వ పురుషుల ఎన్ని అస్తిత్వాలు దాగివున్నాయో" అనుకున్నాడు.

ఏ కొండ ఇరుకులోనో, బండ మెలికలోనో పుట్టిన కిన్నెర గోదావరి ఒడిలో పడి ఊరట పొంది వన్నె కెక్కింది.

ఏ తలంపూ లేకుండా తన అంకతలానికి చేరిన - ఆ పిల్లవాణ్ణి గౌతమీ మాతృమూర్తి ఆ క్షణంనుంచీ తనవాణ్ణి చేసుకుంది. బతుకు పండించింది మనిషిని చేసింది.

కాలవలపక్క పల్లెటూళ్ళు. ఊళ్ళపక్క పచ్చపొలాలు. పళ్ళ బరు

వుకు వంగిన కొబ్బరి, పోకతోటల చెట్ల మొదట జరిగే కావ్యశాస్త్ర పాఠాలు! ఉదయం పొగమంచులో కాలవ స్నానంచేసి తడి అంగవస్త్రాల మడతలతో ఎదురుపడే బ్రాహ్మణ గృహస్థులు. సాయంకాలాల్లో పచ్చని వెలుగులో సంధ్యవార్చే విద్యార్థి వటువులు, కళ్ళనిండా కాటుకతో కలకల లాడే ముఖాలతో శ్రావణవేళల పట్టుచీరలతో ఎదురయ్యే పుణ్యగేహినులు-సంజవేళల బుజంమీద బరువులతో బల్లకట్టు దాటే రైతుజనం-

అరచేత ప్రాణాలు పెట్టుకొని గాలివానాలో చేసిన నావ ప్రయాణాలు- గురువుగారి కుటుంబంతో కలిసిపోయి బంధువు లిళ్ళకు వెళ్ళిన పెళ్ళిపందిళ్ళ సందడులు.

పల్లెపట్టే మా విశ్వవిద్యాలయం, అరుగులే మా పరీక్షా కేంద్రాలు, అరకొర చదువులు పనికిరావు.

నూటికి నూరూ ఆ చదువుల పరమ లక్ష్యం!

గోదావరి ఇసకతిన్నెలమీద ఆడుకుంటూ సుదూర నీలిమలో వూహించుకునే పాపికొండల భయాలు! భద్రాద్రి సీతారాములు——

గట్టెక్కిన తర్వాత -

కడచిన స్నేహాల వియోగాల సలపరింపులు -

సభలు, సాహిత్యాలు, వియ్యాల్లో కయ్యాలూ -

కయ్యాల్లో వియ్యాలు!

రక్తంలో ప్రతి అణువూ ఒక కథ చెబుతుంది.